నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
బుధవారం | 22 మే 2024 | పేజీలు 8

# కన్నుల పండుగగా రథోత్సవం..

- దిగువలో స్వాతి వేడుకలు
- హాజరైన రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి



స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయాన్నే ఉత్సవమూర్తులు శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం రథంలో ఆశీనులను చేశారు. భక్తులు తిలకిస్తుండగా రథోత్సవం ప్రారంభమైంది.

మిగతా 2లో

# దేశాయి చెరువును తోడేస్తున్న "తోడేళ్లు"

- అక్రమంగా మట్టిని తోడుతున్న ఇటుక బట్టీల యాజమాన్యాలు
- నాలుగు గ్రామాల నేతలకు నజరానాలు
- దోపిడికి ఊతమిస్తున్న అధికారులు
- దోచుకున్నోడికి దోచుకున్నంత మట్టి
- నిబంధనలకు తూట్లు.. ప్రభుత్వ ఖజానాకు గండి

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు ప్రాంతంలో ఇటుక బట్టీల వ్యాపారం అధికమైంది... ఇటుకలు తయారు చేసేందుకు కావలసిన మట్టిని తోడేళ్ల వలె తోడేస్తున్నారు. అక్రమంగా చెరువులో మట్టి తోడేస్తున్న తోడేళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అందుకే వారు తోడేసుకున్నంత తోడేసుకుంటూ..వారి వ్యాపారాన్ని మూడు పూలు 12 కాయలుగా మలుచుకున్నారు. నందవరం మండలం తుంగభద్ర దిగువ కాలువ కింద ఉన్న

మిగతా 2లో





# కాకి లెక్కలతో కాలం గడుపుతూ..

- ఓట్ల లెక్కింపు కోసం ఎదురుతెన్నులు
- విజయం సాధిస్తామని ఇరుపార్టీల ధీమా
- పందెం రాయుళ్లకు నిద్రలేని రాత్రులు



**కర్నూలు, సూర్య ప్రతినిధి:** ఎన్నికలకు పోలింగ్ ముగిసి వారం రోజులు పూర్తయినా జిల్లాలో రాజకీయ అభిమానులు ఇంకా కాకి లెక్కలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఒక వైపు వేసవి దుక్కులు దున్నుతూ సమయం చిక్కితే ఏ రాజకీయ పార్టీకి ఏ మేరకు విజయావకాశాలు ఉన్నాయో లెక్కలు వేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా 14రోజుల సమయం ఉండటంతో జయాపజయాలపై ఎవరికి తోచిన పద్ధతుల్లో వారు విశ్లేషించుకుంటున్నారు. పనిలో పనిగా పందెం రాయుళ్లు మాత్రం నిద్ర లేని రాత్రుల్లు గడుపుతున్నారు. ఎక్కడ రాజకీయ చర్చ జరిగినా అక్కడ ఆసక్తిగా వింటూ తన పందెం ఉంటుందా ఊడుతుందా అన్న ఆందోళన మధ్య ఊగిసలాడుతున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలకు చెందిన నాయకులు మాత్రం విజయంపై ధీమాతో ఉన్నారు. ఏదైనా అనుమానం ఉన్న నాయకులు మాత్రం రాజకీయ విశ్లేషకులు, తమకు అనుకూలంగా ఉన్న వారితో ఓటింగ్ సరళి, ఓటర్ల మనసు ఏ పార్టీపై ఉంది అన్న విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి కొందరు నాయకులు ఏదైతే అది అయిందని విహార యాత్రలకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎవరు ఎలా ఉన్నా తీర్పు ఇవ్వాల్సిన " ఏక్ దిన్ కా సుల్తాన్ " ఓటరు మహాశయులు మాత్రం తమ ఓటును ఈవిఎంలలో నిక్షిప్తం చేశారు. జిల్లాలో ఏడు శాసన సభా నియోజక వర్గాలకు,

మిగతా 2లో

# మొదలైన వజ్రాల అన్వేషణ



వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:**

మండలంలో వానలు కురవడంతో వజ్రాల అన్వేషణ ప్రారంభమైంది. మండల పరిధిలోని జొన్నగి రి, పగిడిరాయి గ్రామాలకు గుంటూరు, గుత్తి, బళ్లారి, బెంగుళూరు, కర్నూలు వివిధ పట్టణాలకు చెందిన వారు ఇచ్చి తమ అదృ ష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ గ్రామాల్లో విలువ చేసే వజ్రాలు దొరుకు తాయని ప్రజల నమ్మకం. పదిరోజుల క్రితం చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తికి వజ్రం కూడా దొరికింది. దీంతో ఆయా గ్రామాల్లో వజ్రాల అన్వేషణ ముమ్మరంగా సాగుతోంది.

# విజయం మనదే

- ఎవరిధీమా వారిదే
- మూడోసారి మనదే అంటున్న వైసిపి
- టిడిపిలో గెలుపు ధీమా
- కాంగ్రెస్‌లో నిస్తేజం

వైయస్ఆర్ కాంగ్రెస్

**కోడుమూరు మేజర్ న్యూస్:** ఈ నెల 13న జరిగిన ఎన్నికలలో కోడుమూరు నియోజకవర్గం నుండి ఏ పార్టీ విజయకేతనం ఎగురతుందోనన్న ఉత్కంట కోడుమూరు నియోజకవర్గంలోని ఓటర్లలో నెలకొంది. ఏకొద్దిపాటి సమయం దొరికినా పిచ్చాపాటిగా మాట్లాడే విషయాలలో ఇప్పుడు కోడుమూరు విజేత ఎవరనే చర్చనే సర్వత్రా జోరుగా సాగుతుంది. ప్రదాన కూడళ్లలో, టీ సెంటర్లలో,పనులకు వెళ్లిన కూలీలల్లో,ఏ ఇద్దరు ముగ్గురు రాజకీయ నేతలు కలిసినా నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్ సరళి,ఏ పార్టీ ఓటర్లను ఎక్కువగా ఆకట్టుకుంది,ఓటర్లకు నేతలు ఎరవేసిన తీరును బట్టి కోడుమూరు ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారో అన్న చర్చ జోరుగానే జరుగుతుంది. మొదటగా నియోజకవర్గంలో కాంగ్రెస్,వైసిపి, టిడిపి త్రిముఖ పోరు ఉంటుందని అనుకున్నప్పటికీ తీరా పోలింగ్‌డే నాటికి ముందే కాంగ్రెస్ అభ్యర్థి పరిగెల మురళీకృష్ణ ముఖం చాటేయడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో, నేతల్లో, కార్యకర్తల్లో నిస్తేజం ఏర్పడింది. దీంతో నియూజకవర్గంలో టిడిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి వైసీపీ అభ్యర్థి అదిమూలపు సతీష్‌లు

మిగతా 2లో

## బిఎల్వోల శ్రమ దోపిడి

వార్త 8లో

## కౌంటింగ్ నిర్వహణకు పక్కగా ఏర్పాట్లు చేస్తున్నాం

వార్త 5లో

## ఆకాశాన్ని అంటుతున్న గ్రాసం ధరలు

వార్త 4లో

# విజయం మనదే

(మొదటి పేజీ తరువాయి)

డీ అంటే డీ అన్నట్లుగా ఈ ఎన్నికల్లో తలపడ్డారు. పోలింగ్ డే కంటే ముందు నాటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్లకు ఎరవేయడంలో ముందంజలో ఉన్నారు. ఓటర్లకు గాళం వేయడంలో తెలుగుదేశం పార్టీ కాస్తంత వెనుకబడిందనే చెప్పవచ్చు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఓటర్లను ప్రభావితం చేయడంలో ఆరితేరారు. కాబట్టే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ గెలుపు ఖాయమని,నియోజకవర్గంలో గల వైసిపి పట్టును కోల్పోదని ముచ్చటగా మూడవసారి 15 వేల మెజార్టీతో వైసిపి జెండా ఎగరవేస్తామని, వైసిపి నేతలు లెక్కలు గట్టారు. కోడుమూరు మండలంలో 5 వేలు, గుడూరు బెలగల్ మండలాల నుండి 5 వేలు, కర్నూలు మండలంలో 5 నుంచి 10 వేల మెజార్టీ తప్పకుండా వస్తుందని వైసిపి నేతలు లెక్కగడుతున్నారు. టిడిపి కి ఆయువుపట్టుగా ఉన్నటువంటి కర్నూలు మండలంలో టిడిపికి మెజార్టిని భారీగా తగ్గించామని కోడుమూరు గూడూరు బెల్లగల్ మండలాల మెజార్టీతోనే వైసిపి తన పట్టును నిలబెట్టుకొంటుందని రాజకీయ పరిశీలకులు వాపోతున్నారు. గత ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం విపరీతంగా ఉండడంతోఅత్యధిక మెజార్టీతో గెలుపొందామని నేడు వైయస్ జగన్ చెపట్టిన సంక్షేమ పథకాలు, కోట్ల హర్ష నాయకత్వంలో వైసిపి గెలిచి తీరుతుందని కోట్ల మార్కుకు నియోజకవర్గంలో తిరుగు లేదని మరోమారు నిరూపిస్తామని వైసిపి నేతలు ఘంటా పదంగా అంటున్నారు. ఇది ఇలావుండగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చరిత్ర తిరగరాస్తుందని, బొగ్గుల దస్తగిరి విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలుగుదేశం పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు, గూడూరు, బెలగల్ మండలాల్లో 6 వేల మెజారిటీ, కర్నూలు మండలం 10 వేల మెజారిటీ, మొత్తం 16 వేల మెజార్టీతో టిడిపి విజయకేతనం ఎగురవేస్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తుండగా, కోడుమూరు గూడూరు బెలగల్ మండలాలు వైసిపి మెజార్టీకి సమానం కాగా కర్నూలు మండలం 10 వేల మెజార్టీతో బొగ్గుల దస్తగిరిని గెలుపొందుతారని టిడిపి నేతలు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పరిగెల మురళీకృష్ణ ఎన్నికల్లో చేతులెత్తేయడంతో,వైసిపి పార్టీ మురళి కృష్ణకు చేసిన ద్రోహానికి వ్యతిరేకంగా ఆయన అభిమానులు కూడా సైకిల్ గుర్తుపై ఓట్లు వేశారని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వైసిపి నేతల దందాలతో నియోజకవర్గంలోని ప్రజలు విసిగిపోయారని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు, భూమి హక్కు పత్రం వంటి పథకాలతో విసిగిపోయిన రైతులు,ప్రభుత్వ ఉద్యోగులు టిడిపికి ఓట్లు వేసి వైయస్ జగన్ కు బుద్ధి చెప్పారని,జనసేన,బిజెపి పార్టీల ఓట్లు టిడిపికు తోడయ్యాయని, చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలను ఆకట్టుకోగా, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో కోడుమూరు కోటను బద్దలుకొట్టి నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేసి చరిత్రను తిరగరాస్తామనే ధీమాలో టిడిపి నేతలున్నారు. ఎవరు ఏవిదంగా అంచనాలు వేసినా వైసిపి,టిడిపి అభ్యర్థుల్లో ఎవరు విజయం సాదించినా కేవలం 5 వేల నుండి 3 వేల మెజార్టితో బయటపడతారని పలువురు రాజకీయ నాయకులు వాపోతున్నారు. ఎవరి అంచనాలు తలకిందులు అవుతాయో ఎవరిని విజయం వరిస్తుందో తెలియాలంటే జూన్ నాలుగు దాకా వేచి చూడల్సిందే మరి.

## దేశాయి చెరువును తోడేస్తున్న "తోడేళ్లు "

(మొదటి పేజీ తరువాయి)

దేశాయి చెరువులో మట్టి తోడేలు పడ్డాయి.. ఒక జెసిపి తో పాటు పది టిప్పర్లు దాకా మట్టిని తోడేస్తున్నాయి.. రోజుకు వందల సంఖ్యలు టిప్పర్ల ద్వారా చెరువు మట్టితరలిపోతూ ఉంది.. ఇందుకుగాను చెరువు చుట్టుపక్కల ఉన్న హాలహర్వి పంచాయతీలోని నాలుగు గ్రామాల నేతలకు లక్షల్లో నజరాణాలు ముట్ట చెప్పడమే వారి పని.. ఏ పార్టీ నేతలు నోరు మెదపకూడదని నోట్ల కట్టలు వెదజల్లడం ఇటుక బట్టీల వ్యాపారులకు వెన్నతో పెట్టిన విద్య,. అక్కడ ఇచ్చే నజరానాల తోనే ఆగిపోతారు అనుకుంటే పొరపాటే.. ఎవరు నోరు మెదిపిన నోట్ల కట్టలు చేతులు మారుతాయి.. రాజకీయ పార్టీ నాయకులను.. అధికారులను.. అనధికారులను.. చివరకు ఆయా పార్టీల కార్యకర్తలకు కాసులు వెదజల్లుతూ ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల వ్యాపారులు దోపిడీలకు దారులు వేసుకుంటున్నారు.. మే, జూన్ మాసం వచ్చిందంటే చాలు ఇటుకల వ్యాపారాలు ఇచ్చే కాసుల పండుగ కోసం అంతా ఎదురు చూస్తుంటారు. తుంగభద్ర దిగువ కాలువ అధికారులు కానీ, వాల్టా చట్టం తో కూడిన అధికార బృందమైన వారు పట్టించుకోకపోగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.. గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన మండల రెవెన్యూ.. పోలీస్.. సెబ్ అధికారులు సైతం నోరు మెదపడం లేదంటే దేశాయి చెరువులో మట్టి దొంగల భరతం ఎవరు పడతారని.. ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.. ప్రతి ఏటా దేశాయి చెరువులో పడిన అట్టి దొంగల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో నష్టం వాటిల్లుతూ వస్తుంది.. దోచుకున్నానికి దోచుకున్నంత అన్న చందంగా.. మట్టి దొంగలకు తోడుగా నిలుస్తున్న రాజకీయ నాయకులు.. అధికారులకు కాసుల పండగ అయితే.. వారికి ఇచ్చిన లక్షల్లో ముడుపుల కారణంగా ఇటుక బట్టీల వ్యాపారులు వినియోగదారులు నిలువునా దోచుకుంటూ పోవడం ఆనవాయితీగా మారింది.. నందవరం మండలం ధర్మాపురం దేశాయ్ చెరువులో జరుగుతున్న మట్టి దోపిడీకి ముఖ్యంగా తుంగభద్ర దిగువ కాలువ అధికారులు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది.. ఎంత మట్టి దోపిడీ జరుగుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అన్నది మాత్రం ఉన్న సూత్రమే అని అర్థం పడుతుంది.. ఒకవేళ మట్టి కోసం ఇటుక బటీల వ్యాపారుల నుండి తూతూ మంత్రంగా చలానాలు కట్టించుకుని అనుమతులు కొసరంతా తెప్పించి, దోపిడీకి కొండంత సహకరిస్తున్నారు అన్న ఆరోపణలు సంబంధిత అధికారులపై వస్తున్నాయి.ఇలా మట్టి తవ్వకాల్లో అందవేసిన చేయిగా ముందు పోతున్న ఇటుక బట్టీల యజమానులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నందవరం మండలంలోని ప్రజలు కోరుతున్నారు. ఇలా ప్రభుత్వ నిబంధనలు గాలికొదిలి ఆదాయాన్ని ఏం చేస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి.తహసిల్దార్ వివరణ కోరెందుకు మేజర్ న్యూస్ ప్రతినిధి చరవాణిలో ప్రయత్నించగా సంబంధిత అధికారి అందుబాటులోకి రాలేదు..

# కన్నుల పండుగగా రథోత్సవం..

(మొదటి పేజీ తరువాయి)





అహోబిల ఆలయం మాడవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కళ్యాణం రోజు స్వామి అమ్మవార్లను నేరుగా దర్శించుకోలేని భక్తులకు దర్శనం ఇచ్చేందుకు రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దిగువ అహోబిలంలో స్వాతి నక్షత్రం సందర్భంగా అద్దాల మండపం ఆవరణంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి అద్దాల మండపంలో కొలువుంచి ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం వేదమంత్రాలు నడుమ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. సుదర్శన హోమం నుండి వెలువడిన కాటుకను, సుదర్శన రక్షలను భక్తులకు అందజేశారు.

**స్వాతి, రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న గంగుల :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరిగిన స్వాతి వేడుకల్లో రాష్ట్ర జల వనరుల శాఖ గౌరవ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి పాల్గొని పూజ నిర్వహించారు. అలాగే ఎగువ అహోబిలంలో జరిగిన రథోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రథోత్సవం ప్రారంభం నుండి ముగిసే వరకు రథం వెంటే ఉండి తన భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఆయన వెంట ఆళ్లగడ్డ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, కెడిసిస్ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ మండల ఉపాధ్యక్షులు నా సారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాకి లెక్కలతో కాలం గడుపుతూ..!

(మొదటి పేజీ తరువాయి)

కర్నూలు లోక్‌సభా స్థానానికి ఎన్నికలు పూర్తయ్యాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా ఆదోనిలో 66.55శాతం, ఆలూరులో 80.73 శాతం, కోడు మూరులో 79.14శాతం, కర్నూలులో 63.75, మంత్రాలయంలో 84.31శాతం, పత్తికొండలో 84.98శాతం , ఎమ్మిగనూరులో 81.97శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఎన్నికల అధికారులు జిల్లాలోని నలు మూలల నుంచి ఈవిఎంలను కర్నూలు నగర శివార్లలోని రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రాంగణానికి తరలించి మూడంచెల భద్రత మధ్య వాటిని ఉంచారు. ఇక ఓట్ల లెక్కింపునకు అవసనమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసి ఓట్లను లెక్కించే ప్రక్రియను చేపట్టనున్నారు. పోలైన ఓట్లను బట్టి కనిష్టంగా 16, గరిష్టంగా 23 రౌండ్లలో ఓట్లను లెక్కించే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. జూన్ 4వ తేదీ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. గతంలో కంటే ఈ సారి ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఎక్కువ మందికి ఇవ్వడంతో వాటి లెక్కింపు సుమారు రెండు గంటల పాటు ఉంటుందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఈవిఎంలలో ఓట్లను లెక్కించనున్నారు. సగటున సుమారు 20 నిమిషాలకు ఒక రౌండు చొప్పున ఓట్లను లెక్కించే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ లెక్కన ఈవిఎంల ఓట్ల లెక్కింపునకు కనిష్టంగా 3గంటలు, గరిష్టంగా 4గంటల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అంటే మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మొదటి ఫలితం వెలువడుతుందని చివరి ఫలితం మధ్యాహ్నం రెండు గంటల తరువాత ప్రకటిస్తారని భావిస్తున్నారు. అయితే విజయావకాశా లపై ఆయా పార్టీల నాయకులకు ఉదయం 11గంటల సమయంలో అర్థమవుతుందని గెలుపు ధీమా ఇంకా ఉంటుందా సడలుతుందా అన్నది ఆ సమయానికి తేలిపోతుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాగా ఈ సారి ఎన్నికల్లో 1996, 2019 ఎన్నికల తరహాలో సైలెంట్ ఓటర్ల పాత్ర కీలకంగా ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం అంత సులభం కాదని జూన్ 4 వరకు ఆగాల్సిందేనని వారు వెల్లడిస్తున్నారు.

# పైప్ లైన్ పనులను వెంటనే నిలిపివేయాలి

**రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలి**

**ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి .రామకృష్ణ**

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** కేతవరం గార్గేయపురం మధ్యలో జరుగుతున్న పైపులైన్ పనులను మంగళవారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న. సిఐటియు మండల అధ్యక్షులు జి శ్రీధర్. స్థానిక రైతులతో కలిసి పనుల వద్దకు వెళ్లి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఘాతాల(బ్లాస్టింగ్ చేయుట కొరకు) గుంతలు తీస్తున్న మరియు జెసిబి పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా రైతులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా పనులను చేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు .ఇది రైతులకు తీరని అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు గత సంవత్సరం రైతులందరికీ నోటీసు ద్వారా భూములు కోల్పోతున్న వారందరినీ తమ యొక్క అభిప్రాయాలు తెలియజేయమని తెలిపారు.అదేవిధంగా ఎవరెవరి భూమిప్రాజెక్టులో ఎంత పోతుందో తెలిపారని రైతులు పూర్వపు ఆర్డీవో కు వ్రాతపూర్వకంగా అర్జీ రూపంలో తెలియజేశారని ఆ సందర్భంగా ఆర్డీవో మీ భూములకు సరైన పరిహారం ఇచ్చి రైతుల ఖాతాల్లో నష్టపరిహారాన్ని వేసిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కానీ ఇప్పుడేమో దానికి విరుద్ధంగా రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా యదేచ్చగా పైపులైన్ పనులను చేయడం అంటే రైతుల యొక్క అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బెదిరించి పనులు చేయడం ఏమాత్రం సమంజసం కాదని రామకృష్ణ విమర్శించారు. అంతేకాక పనుల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండా రోడ్డు పక్కలోనే 10 15 అడుగుల గుంత తీశారని రోడ్డుపైన వెళ్లేటువంటి వాహనదారులు ప్రజలు ముఖ్యంగా పశువులు ఆ గుంతలో పడి చనిపోతున్నాయని ఇప్పటికే అటువంటి ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలెక్టర్ గారు స్పందించి రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి కేతవరం గ్రామానికి తాగునీటి కరువు ఉందని ఈ పైప్ లైన్ ద్వారా మంచినీళ్లు కుంటకు రెగ్యులర్ గా నీళ్లు నింపాలని, కేతవరం నుండి గార్గేయపురం వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాజకీయా లతో సంబంధం లేకుండా రైతులను ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని న్యాయం జరిగే వరకూ పైపులైను పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు రంగస్వామి బుగ్గ రాముడు నాగరాజు వెంకటేశ్వర్లు మద్దిలేటి శ్రీనివాసులుశెట్టి,సిద్దయ్య వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కర్ణాటక మద్యం స్వాధీనం .. వ్యక్తికి రిమాండ్

**నందవరం,మేజర్ న్యూస్ :** నందవరం మండలం నాగలదిన్నె వంతెన దగ్గర ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తు ఓ మద్యం వ్యాపారి పట్టుపడ్డారు. నందవరం ఎస్సై తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు మంగళవారం మధ్యాహ్నం సమయంలో కర్ణాటక రాష్ట్రం తలమారి నుండి ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన గొల్ల రామకృష్ణ ఏపీ 39 ఎల్.వి 2606 నెంబరు గల ద్విచక్ర వాహనంపై 576



కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గమనించి అక్కడ పోలీస్ సిబ్బంది పట్టుకున్నారని వెల్లడించారు.. వచ్చిన సమాచారం మేరకు జరిగిన దాడుల్లో భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అంతర్రాష్ట్ర మద్యాన్ని ఎవరు తరలించిన ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు.. ఇప్పటికే నాగలదిన్నె వంతెనకొండ అక్రమ వ్యాపారులకు చెక్ జరిగిందన్నారు.. ఇకపై ఎవరైనా ఆ మార్గంలో అక్రమ మద్యం తరలించిన తగిన చర్యలు ఉంటాయన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సోమశేఖర్ హనుమంతుడు పాల్గొన్నారు.

# ఈ నెల ఆఖరులోపు వందశాతం పన్నులు చెల్లించాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మేజర్ పంచాయతీ గ్రామ ప్రజలు, వ్యాపారులు ఈ నెల 30 తేది లోపు ఇంటి పన్నులు, కొళాయిపన్ను, దుఖనాల పన్నులు కట్టాలని పంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి సతీష్ కోరారు. ఆయన మంగళవారం గ్రామంలోని వీదుల్లో ఆయన పర్యటించారు. ఇప్పటి వరకు గోనెగండ్లలో 70 శాతం పన్నులు వసూళ్లు ఆయ్యాయని మిగత 30 శాతం ఈ నెల ఆఖరు లోపు చెల్లించాలని కోరారు. అనంతరం వీదిల్లో వరసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీ లతో తొలగించారు గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అంటు వ్యాధులు ప్రభల కుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. వందశాతం పన్నులు చెల్లించి



గోనెగండ్లలోని వీదులలోని మురికి కాలువలను శుభ్రం చేస్తున్న దృశ్యం

గ్రామాభివృద్దికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మలాంగా బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘర్షణలకు పాల్పడితే సహించం



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చిన్న చిన్న విషయాలకు ఘర్షణ లకు దిగితే సహించేది లేదని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ హెచ్చరించారు.మండలంలోని గొడెగనూరు గ్రామంలో జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు మంగళవారం పోలీసు బలగాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించి కవాతు చేపట్టారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని, అనవసరంగా ఎవరు కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లకూడదని, కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎన్నికల కోడ్ ఉన్నందున 30 పోలీస్ శాఖ అమల్లో ఉందని తెలిపారు. గ్రామస్తులు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో ఎవరు పాల్గొన రాదని హెచ్చరించారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలియజేశారు.అనంతరం వాహన తనిఖీ లు చేపట్టి సరైన ధృవపత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసారు.కార్యక్రమంలో శిరివెళ్ల సీఐ చంద్రబాబు, ఎస్ఐలు రమణయ్య,నర్సింహులు,నిరంజన్ రెడ్డి,ఏఎస్ఐ నబి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన మొగరాజు శైలజా గారు 10-5-2024వ తేదీన తన ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్ సేల్ డీడీ డాక్యుమెంట్లు 1.డాక్యుమెంట్ నెంబర్: 5727/2014 తేదీ 30.07.2014 2.డాక్యుమెంటర్ నెంబర్9064/2014 ఎస్ఆర్వో కర్నూలు తేదీ23.08.2014 3. డాక్యుమెంట్ నెంబర్: 6094/2014 ఎస్ఆర్వో కల్లూరు తేదీ 26.09.2014 4. డాక్యుమెంటర్ నెంబర్:3709/1974 తేదీ 30.09.1974లను జిరాక్స్ కాపీలు తీసుకోవడానికి కర్నూలు పట్టణంలోని గీతానగర్‌లోని తన ఇంటి నుండి తన బైక్ మీద బళ్లారి చౌరస్తాలోని జిరాక్స్ సెంటర్‌కు జిరాక్స్ కాపీలు తీసుకోవడానికి వెళ్తుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్లు పెట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్ జారి పడిపోయింది. కావునా సదరు డాక్యుమెంట్లు ఉన్న బ్యాగ్ దొరికిన యెడల ఎవరైనా నా అడ్రస్‌కు తెచ్చి ఇవ్వగలరని కోరడమైనది. తెచ్చి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

B.Venkateswarlu,
Advocate,
H.No: 64/27 UpStair,
Mallikarjuna Law Agency,
Muncif Court,
Kurnool. Cell: 9849457906.

## 26వసారి బ్లడ్ డొనేట్ చేసిన నవీన్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో 13రోజుల పాపకు అత్యవసరంగా ఏపాజిటివ్ రక్తం కావాలని సమాచారం తెలుసుకున్న స్టూడెంట్ లీడర్ ముద్దం నాగనవీన్ నంద్యాల విజయ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌కు వచ్చి తన ఏ పాజిటివ్ రక్తాన్ని దానం చేసి ఆ పాప ప్రాణాలు కాపాడారు. సమయానికి స్పందించి రక్తదానం చేసిన రక్తదాన నవీన్‌కు ప్రముఖులు అభినందనలు తెలిపారు. అలాగే పేషెంట్ తరపు బంధువులు ధన్యవాదాలు తెలిపారు.విజయ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దాపురంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

**– 5 మోటర్‌సైకిళ్లు సీజ్**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సిద్దాపురం గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించి ఐదు మోటర్ సైకిళ్ళను సీజ్ చేసినట్లు సిఐలు నాగభూషణ్, లక్ష్మినారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐలు మాట్లాడుతూ మంగళవారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిద్దాపురం గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలోని అనమానిత ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. పత్రాలు లేని ఐదు మోటర్ సైకిళ్ళను గుర్తించి కేసు నమోదు చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. శాంతిభద్రతల దృష్టా సమస్యాత్మక గ్రామాల్లో ఈ సోదాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని పట్టణంతో పాటు గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘీక కార్యక్రమాలకు చోటువివ్వకుండా ముందస్తుగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటివారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాములపాడు, కొత్తపల్లి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# నంద్యాలలో కార్టన్ సెర్చ్

**– సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్**

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్:** జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు కార్టన్ సర్చ్ నిర్వహించారు. సోమవారం రాత్రి టూ టౌన్ పరిధిలోని విశ్వనగర్‌లో, త్రీ టౌన్ పరిధిలోని దేవనగర్, వీసీ కాలనీలలో అనుమానితుల ఇళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అలాగే రౌడీ షీటర్లకు, నేర చరిత్ర కలిగిన వారిని, అనుమానితులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సరైన ధృవపత్రాలు లేని 32 మోటారు సైకిళ్లను, రెండు ఆటోలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు మాట్లాడుతూ జూన్ 4వతేదీన జరుగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్టన్ సర్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా మొత్తం 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు.



విశ్వనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రాజారెడ్డి

# విద్యుత్ తీగలు తగిలి గొర్రె మృతి



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని సిద్ధన గట్టు గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తికి చెందిన గొర్రె విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని వాగులో నీరు తాగేందుకు వెళ్లిన గొర్రెలు ప్రమాదవశాత్తు విద్యుత్ నియంత్రికకు తగిలాయి. దీంతో ఒక గొర్రె అక్కడికి అక్కడే మృతి చెందగా రెండు గొర్రెలు ప్రమాదవశాత్తు తప్పించుకున్నాయి. ఈ ప్రమాదం కారణంగా 15వేల రూపాయలు నష్టం వాటిల్లిందని గొర్రెల యజమాని మరియు గొర్రెల బాధితులు వాపోయారు. అక్కడి ట్రాన్స్ఫారంను విద్యుత్ వైర్లను మార్చి ప్రజల ప్రాణాలతో పాటు మూగజీవాల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరారు.

# ఇద్దరు మహిళలది హత్యే

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** నగర శివారులోని నగరవనంలో లభించిన మూడు మహిళల శవాల కేసులో ఇద్దరు మహిళలది హత్యేనని నిర్ధారణకు వచ్చింది. నగరంలోని ఎన్టీఆర్ బిల్డింగ్‌కు చెందిన మహదీప్ అలియాస్ మసాల బాష అనే ఆటోడ్రైవర్ తెలంగాణకు చెందిన జానకి, అరుణలు గతంలో అతనిపై వేరేవాళ్లో దాడి చేయించగా కారణంగా కక్షపూరితంగా వారిని ట్రాప్ చేసి మద్యం తాపించి నగరవనం వద్దకు కొట్టి నీళ్ల పడేసి చంపేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై బుధవారం స్థానిక పోలీసులు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

# మహిళ అదృశ్యం.. కేసు నమోదు



అదృశ్యమైన మహిళ

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన మహిళ సోమవారం అదృశ్యమైంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల ప్రకారం పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన ఎన్.చంద్రకళ భర్త రంజిత్‌కుమార్‌రెడ్డి నంద్యాలకు వెళ్ళి నంద్యాల ఆర్.టీ.సీ బస్టాండు దగ్గర తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రకళ సోమవారం ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులు కుటుంబసభ్యులు ఎంతవెదికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రంజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

# వైసీపీ నాయకుడి పై కేసు నమోదు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:**

కర్నూలు నగరానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా నాయకుడు ఇంద్రసేనారెడ్డిపై మంగళవారం కేసు నమోదైంది. 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ట్విట్టర్‌ను ఇంద్రసేనారెడ్డి హ్యాక్ చేసి తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా కామెంట్లు చేశారు. దీనిని వెంకటేశ్వర్లు ఇంద్రసేనారెడ్డిపై 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుపై చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సూర్య

బుధవారం | 22 మే 2024

# కంప్యూటర్ రంగానికి పునాదులు వేసింది రాజీవ్‌గాంధీ



నివాళులర్పిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో సమాచార వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కంప్యూటర్ రంగానికి పునాదులు వేసింది భారత మాజీ ప్రధానమంత్రి భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబురావు అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వవర్ధంతిని నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ యువతకు 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించింది, పంచాయతీ రాజ్ వ్యవస్థతో గ్రామాల రూపురేఖల మార్చింది రాజీవ్‌గాంధీ అన్నారు. ఆయన ఆశయన సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు మురళీక్రిష్ణ, కాశీంవలి, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులుయాదవ్, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు అనంతరత్నం, బతుకన్న, సత్యనారాయణగుప్త, సయ్యద్‌నవీద్, లాజరస్, చంద్రశేఖర్, కోసిగి జిలానీ, అమన్, షేక్ ఖాజాహుసేన్, సయ్యద్‌ఖాద్రిబాష, అబ్దుల్‌హై, అభినాయుడు, సుబ్రమణ్యం, దేవకుమార్, ప్రతాప్, వెంకటలక్ష్మి, మద్దమ్మ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా చెన్నకేశవుని కళ్యాణం

– నేడు సింహవాహనం, గరుడోత్సవం
– ప్రముఖుల హాజరు



శేషవాహనంపై చెన్నకేశవుడు



శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి కళ్యాణమహోత్సవ దృశ్యం

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి భూలక్ష్మి, శ్రీదేవి అమ్మవార్ల కళ్యాణం అంగరంగ వైభవంగా, కమనీయంగా సాగింది. మంగళవారం ఉదయం శేషవాహనంపై, రాత్రి హనుమ ఉత్సవం ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అర్చకుడు వెంకటరమణశర్మల వేద మంత్రోచ్చరణలు, భక్త జనుల మధ్య గోవింద నామస్మరణల మధ్య కళ్యాణం కన్నులపండుగగా సాగింది. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో నిర్వహించి భూదేవి, శ్రీదేవి, చెన్నకేశవస్వామి వార్లకు జీలకర్ర, బెల్లం, కన్యాదానం పాద ప్రక్షాళన వంటి వివాహ మహోత్సవంను పూర్తి చేశారు. కళ్యాణమును వీక్షించేందుకు భక్తులు ఆలయ ప్రాంగణం అంతా నిండినది. ఆలయానికి కోట గోడల వెంట విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం ఉదయం 8 గంటలకు వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు సింహవానం పై రాత్రి గరుడోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ యొక్క మహోత్సవ కార్యక్రమానికి ఆలయ నిర్వహణాధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో మరియు గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఉదయం కళ్యాణ మహోత్సవానికి గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, బన్నూరు శ్రీనివాస్‌రెడ్డి, కాతా హరిసర్వోత్తమరెడ్డి, టీచర్ రవీంద్రారెడ్డి తదతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వాహణ జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కౌంటింగ్ నిర్వాహణపై సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ నిర్వాహణపై మే నెల చివరి నెలాఖరులోగా ఫారం 18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదోని నియోజకవర్గం సంబంధించి 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 14టేబులు ఏర్పాటు చేయడం జరిగిందని, 19రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది సంబంధించి ఒక టేబుల్‌కు కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్లను జిల్లా ఎన్నికల అధికారి రాండమైజేషన్ పద్దతి ద్వారా సిబ్బందిని కేటాయిస్తారన్నారు. మే 24, 31వ తేది కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసినా సుల్తాన్, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపమ, ఇంచార్జీ ఎంపిడిఓ విజయ శేఖర్ రావు, డిఎల్‌పిఓ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప, సిఐలు నీరంజన్‌రెడ్డి, గోపి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేడే శ్రీ శ్రీ చిన్నకడుబూరాంజినేయ స్వామి రథోత్సోవం

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా. పెద్దకడుబూరు మండల పరిదిలోని చిన్న కడుబూరు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ చిన్న కడుబూరు అంజనేయస్వామి రథమహోత్సవాలు. ఈనెల 22.23వతేదీలలో(బుధ. గురువారం.)రెండు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామం పెద్దలు. తెలిపారు. అలాగే బుధవారం ఉదయం 8.గంటల నుండి మద్యాహ్నం ఒంటి గంట వరకు స్వామి వారికి భక్తులు ఆకుపూజ. కుంకమార్చన పంచామృతాబిషేకం. గణపతి పూజ. బిల్వార్చన. జలాబిషేకం. తైలాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. తిరిగి అదేరోజున సాయంత్రం 6గంటలకు స్థానిక దేవాలయం వద్ద ఉన్న పుష్పరథంపై స్వామి వారి విగ్రహంను ఉంచి అక్కడ నుండి భక్తులు పుష్పరథాన్ని మేళతాళలతోను మంగళ వాయుద్యాలు. డప్పులు. డ్రమ్స్‌లతోను గ్రామం పురవీధుల గుండా ఊరేగింపుగా స్థానిక బసవణ్ కట్టవద్దకు లాగి మళ్ళీ తిరిగి యధాస్థానంలో వుంచుతున్నాట్లు వారు తెలిపారు. అలాగే గురువారం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారికి భక్తులు ఆకుపూజ. కుంకమార్చన. పంచామృతాబిషేకం. వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాయంత్రం 6గంటల ప్రాంతంలో భక్తులు స్వామి వారిని స్థానిక దేవాలయం వద్ద ఉన్న రథం పై స్వామి వారిప్రథిమను ఉంచి రథోత్సవంను ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి అనంతవరం వేలాదిమంది భక్తులు మేళతాళలతోను. డప్పులు డ్రమ్స్. లతోను గ్రామంలో పురవీదుల గుండా ఊరేగింపుగా అశేష భక్త జనవాహినుల మధ్య రథాన్ని స్థానిక బసవన్న కట్ట వద్దకు లాగి మళ్ళీ యధాస్థానంలో వుంచుతారని వారు తెలిపారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించాలని పెద్దకడుబూరు పోలీసులను వారు కోరారు.



# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



డి.ఎస్.పి షర్ఫుద్దీన్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డి.ఎస్.పి షేక్ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్లో ఎన్నికల కోడ్ సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. పోలీసుల అనుమతి లేకుండా బహిరంగ సభలు సమావేశాలు నిర్వహిస్తే శిక్షార్హులన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు.

# ఎగువ అహోబిలంలో ఘనంగా రథోత్సవం



**ఆళ్లగడ్డ,మేజర్ న్యూస్ :** ఎగువ అహోబిలంలో వైశాఖమాసంలో నరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం మంగళవారం ఎగువ అహోబిలంలో ఘనంగా రథోత్సవం నిర్వహించారు. తిరుమాడ వీధులలో శ్రీ జ్వాలా నృసింహుడు విహరిస్తూ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వేద పండితులు. నిత్యం కూరగాయల వితరణ చేస్తున్న మార్కెట్ ప్రసాద్. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ



మహానంది క్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

**మహానంది, మేజర్‌న్యూస్:** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. మంగళవారం అశేష భక్తజన వాహినితో క్షేత్రం కళకళలాడింది. ఆలయంలోని పుష్కరణీలలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం రోజులుగా క్షేత్రం కళకళలాడుతుంది.

# ఆకాశాన్ని అంటుతున్న గ్రాసం ధరలు

- ట్రాక్టర్ గ్రాసం రూ.18వేలు



గోనెగండ్ల ట్రాక్టర్తో తీసుకువెలుతున్న వేరుశనగ గ్రాసం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతుంది. ఆదోని డివిజన్లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయక పోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గోనెగండ్ల, నందవరం,మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా ఈ ఏడాది పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలమంది రైతులు గ్రాసం నీటి కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఎడాది వరి, వేరుశనగ, పంటలను రైతులు ఎక్కువగా సాగుచేయక పోవడంతో వాటి ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు పలుకుతుంది. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 15,530, బర్రెలు 4,603, గొ8ర్రెలు, 45,257, వే కలు 540, కోళ్లు బాతులు 30,665 లు ఉన్నాయి. గ్రాసం కొరత కారణంగా బళ్లారి, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసంను దిగుబడి చేసుకుంటున్నారు అలాగే వరి, వేరుశనగ వంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం దిగుబడిచేసుకునేందుకు పశుయజమానులు సిద్ధమయ్యారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండండి

**బనగానపల్లెరూరల్,న్యూస్ః**

పశువులలో సోకే సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతీ సకారం తెలిపారు. మంగళవారం నందవరం గ్రామంలో వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల సమయంలో పశువులకు గొంతువాపు వ్యాధి , జబ్బవాపు, జీవాలలో చిటుక వ్యాధి ప్రబలే అవకాశం ఉందని ఈ వ్యాధి నివారణకు టీకాలను వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందవరం పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, పశువైద్య సిబ్బంది జయరాం నాయక్, అటెండర్లు మధు, మాధవ్ పాల్గొన్నారు.

# నిబంధనలకు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**బనగానపల్లెమేజర్,న్యూస్:**

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బనగానపల్లె సి.ఐ గంటా సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందని దానిని కట్టుదిట్టంగా అమలు చేయడం జరుగుతుందని మండలంలో ఎక్కడబడితే అక్కడ గుంపులుగా సమూహాలుగా ప్రజలు గూమిగూడటం రాజకీయ నాయకుల జయాపజయాలుపై వాదోపవాదాలు చేయడం వంటివి ప్రజలు చేయకూడదని 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే కౌంటింగ్ రోజు కూడా కౌంటింగ్ కేంద్రాల వద్దకు నాయకులు, కార్యకర్తలు కాన్వాయ్‌లతో వెళ్లకూడదని అనుమతి ఉన్న వాహనాలతో మాత్రమే సంబంధిత నాయకులు పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వరకు వెళ్లాలని మిగతా వారిని ఎవ్వరినీ కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించేది లేదని అన్నారు. అంతేకాక కౌంటింగ్ పూర్తి అయిన తరువాత సంబరాలు, విజయోత్సవ ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని 8వ తేదీ వరకు కేంద్ర బలగాలను కొనసాగిస్తామని ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ఆయన తెలిపారు.

## పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కండి

**ఫీజులు కట్టకుండా పదవ తరగతి పరీక్షలు హాజరు కావచ్చు**

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** ఈనెల 24 నుండి జరిగే పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు పదవ తరగతి ఫెయిల్ అయినవిద్యార్థులు ఫీజులు కట్టకుండా పరీక్షలకు హాజరై రాయాలని మండల విద్యాశాఖ అధికారి అనురాధ కోరారు. 24వ తేదీ ఫస్ట్ లాంగ్వేజ్, 25వ తేదీ సెకండ్ లాంగ్వేజ్, 27న థర్డ్ లాంగ్వేజ్, 28న మ్యాథమెటిక్స్, 29న ఫిజిక్స్ 30న బయాలజీ31 సోషల్ స్టడీస్,1 జూన్ ఓ ఎస్ ఎస్ సి పేపర్ 1, జూన్ 2న ఓ ఎస్ ఎస్ సి పేపర్ 2 పరీక్షలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఈ ఏడాది మార్చిలో 10 తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యార్థినిలు పరీక్ష ఫీజులు కట్టకపోయినా పరీక్షలు హాజరు కావచ్చు అన్నారు ఫెయిల్ అయిన విద్యార్థులు ఆన్లైన్లో, తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని ఆళ్లగడ్డ ఎద్దుల పాపమ్మ హై స్కూల్, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ( బాలికలు) ఆళ్లగడ్డలో పరీక్షలు రాయాలని కోరారు.కావున విద్యార్థులు ఈ రోజు నుండే ఫీజులు కట్టకపోయినా హాల్ టికెట్లను ఆన్లైన్లో పొంది పరీక్షలు రాయాలని కోరారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రంగనేతాజి హెచ్చరించారు. మంగళవారం చాగలమర్రి పట్టణంలోని శ్రీ లక్ష్మి వెంకట సాయి సీడ్స్, శ్రీ వీరభద్ర స్వామి సీడ్స్ పెస్టిసైడ్స్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను,వివిధ రికార్డులను పరిశీలించారు. యజమానులు తప్పకుండా ఎప్పటికప్పుడు స్టాకు బోర్డ్ నందు వివరాలు తెలుపాలని అదే విధంగా ఏవైన బిల్లులు లేని మరియు నకిలి విత్తనాలు ఉన్నచో చట్ట పరమైన చర్యలు చేపడతామని తెలిపారు.రైతులు తప్పకుండా తాము కొన్న విత్తనాలకు,క్రిమి సంహారక మందులకు బిల్లులు తీసుకోవాలని కోరారు.

## పెట్నికోటలో గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు


కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** ఆళ్లగడ్డ డి.ఎస్.పి ఆధ్వర్యంలో సి.ఐ గోపీనాథ్ రెడ్డి, సంజామల ఎస్.ఐ మల్లికార్జున మరియు వారి సిబ్బంది కలిసి ఈరోజు తెల్లవారుజామున 4:30 గంటలకు కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట గ్రామంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కొలిమిగుండ్లలో పోలీసు కవాతు నిర్వహించారు. ఎలక్షన్ కమీషన్ నిబంధనలకు మేరకు ప్రజలు నడుచుకోవాలని అల్లర్లకు, ఘర్షణలకు తావివ్వకుండా నడుచుకోవాలని వారు తెలిపారు.

## న్యాయవాదుల సమస్యలపై ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ చొరవ చూపాలి



మాట్లాడుతున్న రవికాంత్‌ప్రసాద్

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** న్యాయవాదుల సమస్యలపై ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ చొరవ చూపాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ అన్నారు. మంగళవార నగరంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ రూ.10 లక్షలకు పెంచాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ న్యాయవాదులకు వర్తింపజేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెల నెల రూ.10వేలు స్టైఫండ్ ఇవ్వాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం 2023 నూతన ప్రభుత్వం బిల్లును ఆమోదించాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు రవిగువేరా, మోహన్‌బాబు, నిత్యజీవన్‌రాజు, మహబూబ్‌బాషా, క్రిష్ణమూర్తి, పుల్లన్న, రాజేష్, జగదీష్ పాల్గొన్నారు.

# కౌంటింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం

- కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు
- జూన్ 1వతేదీ నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలక్టర్/జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్‌సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ పోటీలో ఉండే అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను ఫార్మ్-18 ద్వారా నియమించుకోవాల్సి ఉంటుందని, ఏ టేబుల్‌కు అయితే కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకుంటారో, ఆ టేబుల్ వద్దనే కౌంటింగ్ ఏజెంట్లు ఉండాలన్నారు. ఒ ఏజెంట్‌ను కేవలం ఒక టేబుల్‌కు మాత్రమే కేటాయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకంటి కంటే ఎక్కువ టేబుల్స్‌కు కేటాయించడానికి అనుమతి లేదనిన్నారు. జూన్ 1వతేదీన ఆటికి కౌంటింగ్ ఏజెంట్లు నియమించుకోవాలనుకుంటున్న వారి పేర్లను ఇచ్చినట్లు అయితే వారికి ఫోటో ఐడీ కార్డులు, టేబుల్ బ్యాడ్జిలు త్వరితగతిన ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ రోజున ఖచ్చితంగా వారిని నియమించిన లెటర్, ఐడీ కార్డు, డిక్లరేషన్ లెటర్‌లు తీసుకొని రావాలని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు లోపలికి ప్రవేశం ఉండదని, యూనివర్సిటీ పార్కింగ్‌లో ఏర్పాటు చేసిన మొబైల్ డిపాజిటల్ సెంటర్‌లో పెట్టాల్సి ఉంటుందన్నారు. రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ లైన్స్ బ్లాక్, లైబ్రరీ బ్లాక్‌లలో కౌంటింగ్ నిర్వహణకు 8 అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి 16కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కర్నూలు, ఆదోని అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను లైఫ్ సైన్స్ బ్లాక్‌లో, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పాణ్యం అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను ఇంజనీరింగ్ బ్లాక్‌లో, మంత్రాలయం, పత్తికొండ అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధిచించిన ఈవీఎం యంత్రాలను లైబ్రరీ బ్లాక్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. ఎటువంటి కన్‌ఫ్యూజన్ లేకుండా ప్రతి ఫ్లోర్‌ను ఒక నియోజకవర్గానికి కేటాయించడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లను ఆయా నియోజకవర్గాల హెడ్ క్వార్టర్స్ సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి కౌంటింగ్ టేబుల్ మీద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లతోపాటు ఈవీఎంలను తీసుకొని వచ్చేందుకు గాను అటెండర్ కూడా ఉంటారన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వృత్తులను బట్టి ఏర్పడిన కులాల్లో విభేదాలు లేవు

**– విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కప్పగంతుల కోటేశ్వరశర్మ**


మాట్లాడుతున్న కప్పగంతుల కోటేశ్వరశర్మ

**కర్నూలు కల్చలర్, మేజర్‌న్యూస్:** హిందూ సమాజంలో వృత్తులను బట్టి ఏర్పడిన కులాల్లో విబేధాలు లేవని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కప్పగంతుల కోటేశ్వరశర్మ అన్నారు. మంగళవారం నగరంలోని చెన్నకేశవస్వామి కళ్యాణ మండపంలో కుల సంఘాల-దేవాలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కప్పగంతుల కోటేశ్వరశర్మ మాట్లాడుతూ సనాతన హిందూ దేశమైన భారతదేశంలో ఒకప్పుడు అన్ని కులాల వాళ్లు అనగా తమ తమ వృత్తుల ఆధారంగా ఏర్పడిన కులాల్లో సమానమైన గౌరవ భావంతో కలిసి మెలిసి జీవించేవారన్నారు. ఎప్పుడైతే విధర్మీయులైన మహమ్మదీయులు, క్రైస్తవులైన బ్రిటీష్ వారు భారతదేశాన్ని వెయ్యి ఏళ్లు పరిపాలించినప్పుడు భారతదేశ ధ్యేయవాకయమైన భిన్నత్వంలో ఏకత్వంను నాశనం చేశారన్నారు. అప్పుడు వారు పెట్టిన కులాల చిచ్చు అక్కడక్కడా ఇంకా రగులుతూనే ఉందన్నారు. ఆలయాల సంరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకటరామయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కర్నూలు నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్య నరసింహులు, కార్యదర్శి సర్దార్ చెన్నకేశవరాజు, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, సాహ శాధికారి గూడా సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి మాళిగిభాను ప్రకాష్, సహకార్యదర్శులు గూడూరు గిరిబాబు, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, వివిధ కుల సంఘాల నాయకులు, వివిధ దేవాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ సమేత మద్దిలేటి నరసింహస్వామి కళ్యాణోత్సవం



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో జాతీయ రహదారి ప్రక్కన వెలసిన శ్రీ మద్దిలేటి స్వామి ఆలయంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని మంగళవారం శ్రీ లక్ష్మీ సమేత మద్దిలేటి నరసింహస్వామి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణోత్సవంలో వేద పురోహితులు నాగానంద శర్మ, బ్రాహ్మణులతో కలిసి స్వామి అమ్మవారి ఉత్సవ విగ్రహ మూర్తులకు అభిషేకాలు గణపతి పూజ పుణ్యాహవాచనం చేశారు అనంతరం. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూలతో అలంకరించి పెళ్లి పీటలపై ఆసీనులను చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను కనులారా వీక్షిస్తూ గోవింద నామస్మరణ చేస్తుండగా బ్రాహ్మణులు స్వామి అమ్మవార్లకు కళ్యాణం జరిపించారు. కళ్యాణాన్ని తిలకించిన భక్తులు ఆనందంతో పరవశించిపోయారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సహిత మద్దిలేటి స్వామి గ్రామోత్సవ కార్యక్రమంలో భాగంగా బాజా భజంత్రీలతో ఊరేగింపుగా స్వామి అమ్మవార్లను తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సైరాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## కోట మైసమ్మకు వెండి వితరణ

**– నంద్యాల వాసి దూదేకుల సొకరాబి**


వెండి విగ్రహాన్ని ఇస్తున్న ధృశ్యం

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ ఆలయానికి కోట గోడకు ఉన్న కోట మైసమ్మ విగ్రహానికి లక్ష రూపాయలు విలువ చేసే వెండి వితరణ చేశారు. ఆమె మిడ్తూరు గ్రామానికి చెందిన సొకరాబి ప్రస్తుతం నంద్యాల జిల్లాలో నివాసం ఉంటున్నారు. ఈ యొక్క లక్ష్మీచెన్నకేశవ ఆలయానికి తమ వంతు దానం చేయాలని భావించడంతోనే కోట మైసమ్మకు వెండి వితరణ బహుమతిగా ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ ఆలయానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని అర్జుని మునిమనవడు జనమేయజయ మహారాజు ఆలయాన్ని కట్టించాడని ఈ గ్రామంలో ఉండడం విశేషం గా భావించి చెన్నకేశవుని ఆశీస్సులు మా కుటుంబంపై ఉండాలని ఆకాంక్షిస్తూ కోట మైసమ్మకు వెండిని దానం చేశానని ఆమె తెలిపారు.

# వీక్లీ రౌండప్

## అంతర్జాతీయం

### ఏప్రిల్ 29- మే 5

- 25 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ ముంబై విమానాశ్రయ అధికారులకు దొరికిపోయిన అఫ్ఘనిస్థాన్ కాన్సుల్ జనరల్ జాకియా వార్దక్ తన పదవికి రాజీనామా చేశారు.
- కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఎఫ్-16 యుద్ధ విమానాన్ని అమెరికా తన ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో పరీక్షించింది. ఈ యుద్ధ విమానాన్ని మానవ పైలట్ కాకుండా ఏఐ ఆధారంతో నడిపారు.
- చంద్రుడి ఉపరితలం నుంచి శిలలు, మట్టి నమూనాలు సేకరించేందుకు చైనా ప్రయోగించిన చాంగే-6 మిషన్ విజయవంతమైంది.
- ఖలిస్తానీ ఉగ్రవాది నిజ్జార్ హత్య కేసుతో సంబంధం ఉందని ముగ్గురు భారతీయుల్ని కెనడా పోలీసులు అరెస్టు చేశారు. ఐతే ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో కెనడా పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులకు పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తున్నది.
- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్, చైనా, జపాన్, రష్యాలను 'జెనోఫోబిక్' (విదేశీయుల పట్ల విద్వేషం, భయం) దేశాలని విమర్శించారు. భారత్ సహా ఆ దేశాలేవీ వలసదారులను ఆమోదించటం లేదని, దీంతో ఆ దేశాల ఆర్థిక అభివృద్ధిని 'జెనోఫోబియా' అడ్డుకుంటున్నదని అన్నారు. వలసదారులతోనే దేశం మరింత బలోపేతమవుతుంది' అని బైడెన్ చెప్పారు. 'అమెరికా వలసదారులకు ఆహ్వానం పలుకుతున్నది కాబట్టే, ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్నది' అన్నారు.
- అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో పాలస్తీనాకు అను కూలంగా జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి.
- కొవిడ్-19 టీకా అభివృద్ధిలో పాలుపంచుకున్న టాప్ సైంటిస్ట్ యాంగ్ షావోమింగ్‌ను చైనా అవినీతి ఆరోపణలపై పార్లమెంటు నుంచి బహిష్కరించింది. చైనా నేషనల్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ వ్యాక్సిన్ సబ్సిడరీ అయిన చైనా నేషనల్ బయోటెక్ గ్రూప్ (సీఎన్‌బీజీ)కి ఆయన చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. క్రమశిక్షణ, చట్ట ఉల్లంఘనకు సంబంధించి తీవ్రమైన అభియోగాల నేపథ్యంలో నేషల్ పీపుల్స్ కాంగ్రెస్ పార్టీ ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసింది.
- 140 మిలియన్ల మైళ్ల దూరం నుంచి భూమికి లేజర్ సందేశం చేరింది. సైకీ 16 స్పేస్‌క్రాఫ్ట్ నుంచి ఆ సంకేతం అందినట్లు నాసా పేర్కొంది. ఆస్టరాయిడ్ లక్ష్యంగా గత ఏడాది అక్టోబర్ లో సైకీ 16 స్పేస్ క్రాఫ్ట్‌ను నాసా ప్రయోగించింది. మార్స్ , జూపిటర్ గ్రహాల మధ్య ఆ గ్రహశకలం ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సైకీ స్పేస్‌క్రాఫ్ట్‌లో డీప్ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్ ద్వారా లేజర్ కమ్యూనికేషన్స్ చేపడుతారు. ప్రస్తుతం ఉన్న రేడియో తరంగాల కన్నా ఈ లేజర్ కమ్యూనికేషన్ వేగవంతంగా వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సైకీ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఉన్న లేజర్ కమ్యూనికేషన్స్ సుమారు 140 మిలియన్ల మైళ్ల దూరం నుంచి డేటాను ట్రాన్స్‌మిట్ చేసింది. భూమికి, సూర్యుడి మధ్య ఉన్న దూరానికి ఇది 1.5 రెట్లు ఎక్కువ.
- ఉక్రెయిన్‌లో హ్యారీపోటర్ కోటపై రష్యా క్షిపణి దాడి చేసింది. పోర్టు సిటీగా పేరొందిన ఒడెస్సాలోని ఈ కోట వాస్తవానికి ఒక విద్యా సంస్థ అయినప్పటికీ దానిని హ్యారీపోటర్ కోటగా వ్యవహరిస్తారు. స్కాటిష్ నిర్మాణ శైలిలో ఉన్న ఈ భవనం లక్ష్యంగా రష్యా జరిపిన ఈ దాడిలో ఐదుగురు మృతి చెందగా, 32 మంది గాయపడ్డారు
- భారత్ భూభాగాలతో నాలుగేళ్ల కిందట నేపాల్ కొత్త మ్యాప్‌ను రూపొందించడం వివాదాస్పదమయ్యింది. తాజాగా, తమ దేశ కరెన్సీ నోటుపై ఆ వివాదాస్పద మ్యాప్‌ను ముద్రించాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగ సవరణ ద్వారా 2020 జూన్ 18న నేపాల్ తన రాజకీయ మ్యాప్‌లో లిపులేఖ్, లింపియాధుర, కాలాపాని ప్రాంతాలను చేర్చింది. భారత్‌లోని సిక్కిమ్, పశ్చి బెంగాల్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో నేపాల్ 1,850 కి.మీ. సరిహద్దును పంచుకుంటోంది. ఇటీవల కాలంలో చైనాకు దగ్గరై భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతోంది.
- చైనాతో పలు ఒప్పందాలు చేసుకుని, చైనా మద్దతుతో భారత ద్వేషిగా మారిన మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు జిన్‌పింగ్‌కు పూర్తిగా సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే తమ దేశ భూభాగంపై ఏ దేశ సైనికులు ఉండకూడదని పేర్కొంటూ భారత సైన్యాన్ని వెనక్కి పంపించిన మహ్మద్ ముయిజ్జు చైనా విషయంలో మాత్రం ఆ వైఖరిని అనుసరించడం లేదు. తాజాగా మాల్దీవులు సముద్ర జలాల్లోకి చైనా పరిశోధక నౌక ప్రవేశించడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. చైనాకు చెందిన రీసెర్చ్ షిప్ షియాంగ్ యాంగ్ హాంగ్-03.. తిలాఫుషీ ఇండస్ట్రియల్ హార్బర్‌లో లంగర్ వేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.
- ఖతార్ దేశానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ అల్ జజీరాపై ఇజ్రాయెల్ ప్రభుత్వం నిషేధం విధించింది.
- అమెరికాలో ఇన్సులిన్ డోసు పెంచి 17 మంది మరణానికి కారణమైన నర్సు హీథర్ ప్రెస్డీ(41)కి పెన్సిల్వేనియా కోర్టు 700 ఏళ్ల జైలు శిక్ష విధించింది.






## జాతీయం

### ఏప్రిల్ 29- మే 5

- జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వాయుసేనకు చెందిన సైనికుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు.
- ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కనీస ఎగుమతి ధర టన్నుకు 550 డాలర్లుగా నిర్ణయించింది.
- ప్రపంచంలో అత్యంత పెద్ద క్రతువు లోక్‌సభ ఎన్నికల పరిశీలనకు 23 దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల ప్రతినిధులు ఢిల్లీ చేరుకున్నారు. రష్యా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులు చిన్న చిన్న బృందాలుగా గోవా, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్‌ల్లోని వివిధ నియోజకవర్గాలలో జరిగే ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ సరళి, అమలవుతున్న సాంకేతికత తదితరమైనవి పరిశీలిస్తారు.
- భారత్‌లోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘనిస్థాన్ కాన్సుల్ జనరల్ జకియా వార్దక్ (Zakia Wardak). ముంబై విమానాశ్రయ తనిఖీల్లో ఆమె ధరించిన జాకెట్, లెగ్గిన్, మోకాలి క్యాప్‌లో ఏకంగా 25 బంగారు కడ్డీలు బయటపడ్డాయి. దీంతో ఆఫ్ఘాన్ దౌత్యవేత్తపై కస్టమ్స్ చట్టం, 1962 కింద బంగారం స్మగ్లింగ్ కేసు నమోదు చేశారు. కానీ, వార్దాక్‌కు దౌత్యపరమైన రక్షణ ఉండటంతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేయకుండా వదిలేశారు.
- యూనిసెఫ్ (యునైటెడ్‌నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటి కరీనా కపూర్‌ను నియమించింది.
- శ్రీ శారద మఠం, రామకృష్ణ శారద మిషన్ అధ్యక్షురాలు ప్రవ్రాజిక ఆనందప్రాణ మాతాజీ(98) కోల్‌కతాలో కన్నుమూశారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారిగా అయోధ్య రామాలయాన్ని దర్శించుకున్నారు.



- ఛత్తీస్‌గఢ్ ఉద్యమకారుడు, అడవులు, గిరిజన హక్కుల కార్యకర్త అలోక్ శుక్లా ఈ ఏడాదికి గాను ప్రతిష్ఠాత్మక గోల్డ్‌మ్యాన్ ఎన్విరాన్‌మెంటల్ పురస్కారానికి ('గ్రీన్ నోబెల్') ఎంపికయ్యారు.
- దేశంలోనే తొలిసారిగా షెడ్యూల్డ్ కులానికి చెందిన స్వామీజీ 'జగద్గురు' బిరుదు పొందారు. దేశంలోని 13 అఖాడాల్లో ఒకటైన జునా అఖాడా.. మహామండలేశ్వర్ మహేంద్రానందగిరికి ఈ బిరుదును ప్రదానం చేసింది. మహేంద్రానంద శిష్యుడు కైలాశానందగిరికి మహామండలేశ్వర్, రాంగిరికి శ్రీమహంత్ బిరుదు ప్రదానం చేసింది. వీరిద్దరూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారే.
- భార్యతో అసహజ శృంగారాన్ని అత్యాచారంగా పరిగణించలేమని, మారిటల్ రేప్ అనడానికి ఆస్కారం లేదని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది.
- త్వరలో ప్రారంభించనున్న వందే మెట్రో వంద నుంచి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరాల మధ్య రాకపోకలు సాగించనున్నాయి. నగర ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని వీటిని రూపొందిస్తున్నారు. వందే మెట్రోలో నాలుగేసి బోగీలు ఒక యూనిట్‌గా ఒక రైలులో కనీసం 12 బోగీలుంటాయి. తిరుపతి నుంచి చెన్నై, ఆగ్రా-మథుర, లక్నో-కాన్పూర్ మార్గాలను ఎంపిక చేశారు.
- ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్)లో ముంబై సిటీ ఎఫ్‌సీ టైటిల్ విజేతగా నిలిచింది.
- ఏషియన్ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు వేర్వేరు విభాగాల్లో ఫైనల్స్‌కు చేరి రికార్డు స్థాయిలో 43 పతకాలు ఖరారు చేశారు.
- కుక్కలకూ ఆధార్ కార్డ్స్ ఇస్తున్నారు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో.. 100 కుక్కలకు ఈ కార్డ్‌లను జారీ చేయడం జరిగింది.
- రివల్యూషనరీ గార్డ్స్ గత నెల 13న స్వాధీనం చేసుకున్న కార్గో షిప్‌లోని మొత్తం 25 మంది సిబ్బందిని విడుదల చేసినట్టు శుక్రవారం ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది.
- గతేడాది జనవరి-నవంబరు మధ్యకాలంలో భారత్‌లో దాదాపు 7 కోట్ల ఖాతాలను నిషేధించినట్టు వాట్సాప్ తన నెలవారీ నివేదికలో వెల్లడించింది.
- పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, నిషేధిత ఖలిస్థానీ వేర్పాటు సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌కు చెందిన ఉగ్రవాది గోల్డీబ్రార్ బతికే ఉన్నట్లు అమెరికా పోలీసులు వెల్లడించారు.
- జనతాదళ్ సెక్యులర్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలపై లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి.
- లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన మొదటి విడతలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ పేర్కొంది. తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 19న జరిగింది. 66.22% మంది పురుషులు, 66.07% మంది మహిళలు, 31.32% మంది థర్డ్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## రాష్ట్రీయం



- పదకొండేండ్లకే గౌరవ డాక్టరేట్‌కు ఎంపికై కలశ నాయుడు అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. కలశ సామాజికసేవా కార్యక్రమాలను గుర్తించిన యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ పీస్ కౌన్సిల్ ఇటీవలే గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది.



- తెలంగాణ రాష్ట్రంలో తుది ఓటర్ల జాబితా ప్రకారం 3,32,16,348 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,65,28,366, మహిళలు 1,67,01,192, థర్డ్ జెండర్ వారు 2,760 మంది ఉన్నారు. దివ్యాంగులు 5,27,486 ఓటర్లు ఉన్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 30-39 సంవత్సరాల వయసున్న వారు అత్యధికంగా 91 లక్షల మంది ఓటర్లు ఉండగా, 18, 19 సంవత్సరాల వయసున్న కొత్త ఓటర్లు 9.20 లక్షల మంది ఉన్నారు.
- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్ ఆఫ్ గ్లాస్గో 'డిప్లొమా ఆఫ్ ఫెల్లోషిప్ ఎఫ్ఆర్‌సీపీఎస్'కు ఎంపిక చేసింది.
- గోదావరి నదిపై ములుగు జిల్లాలో నిర్మిస్తున్న తుపాకులగూడెం బరాజ్ (సమ్మక్క సాగర్) కింద ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.
- ఏపీలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి చెన్నై నగరాల మధ్య వందే మెట్రో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ రైలులో 12 బోగీలుంటాయి
- ప్రపంచ వేద విజ్ఞాన కేంద్రంగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంటుందని టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి వెల్లడించారు.
- ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని తక్షణమే బదిలీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించవద్దని స్పష్టం చేసింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనాతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేశాయి.
- ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా హరీష్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు.

### నీట్ కు 23 లక్షల మంది విద్యార్థులు హాజరు

- ఎంబీబీఎస్‌తదితర వైద్య విద్యా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది పైచిలుకు విద్యార్థులు హాజరైనారు. ఈసారి ప్రశ్నపత్రం చాలా కఠినంగా ఉందని, ముఖ్యంగా ఫిజిక్స్‌లో కఠినమైన ప్రశ్నలు ఇచ్చినట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఫలితాలు జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్ష సంస్థ ప్రకటించింది. ఈ నెలాఖరులోగా నీట్ 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 704 మెడికల్ కాలేజీల్లో 1,07,948 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఒక్కో సీటుకు సగటున 21 మంది పోటీ పడుతున్నారు. కన్వీనర్ కోటాలో సీటు దక్కాలంటే కనీసం 440 మార్కులు రావాలి.



## అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో రాయల్ కాప్స్ సభ్యులు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ఆళ్లగడ్డ మండల పరిధిలోని పుణ్యక్షేత్రమైన అహోబిలంలో మంగళవారం వైశాఖమాస స్వాతి నక్షత్రం సందర్భంగా నవ నరసింహ స్వామి వారిని రాయల్ కాప్స్ గౌరవ సలహాదారుడు గూడూరు సంజీవరాయుడు, రాయల్ కాప్స్ ఏపీ తెలంగాణ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివ రాయల్ (జర్నలిస్ట్), మనోజ్, శిరివెళ్ల మండల రాయల్ కప్ అధ్యక్షుడు బండి రామచంద్రుడు, పాములేటి, తదితరులు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. రాయల్స్ కాప్స్ తరపున పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## బిఎస్ఎఫ్ దళాలతో పోలీసుల కవాతు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో మంగళవారం శాంతి భద్రతలపరిరక్షణదృష్ట్యా బిఎస్ఎఫ్ దళాలు, పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి నుండి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు, తిరిగి పట్టణ పోలీస్ స్టేషన్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్ సిఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, ఎస్సైలు వెంకటరెడ్డి, నరసింహులు, బిఎస్ఎఫ్ దళాలు, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

## గురుకులం ఇంటర్‌లో ప్రవేశాలు



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శ్రీదేవి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థులకు ఈ నెల 22, 23వతేదీల్లో అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు కో-ఆర్డినేటర్ శ్రీదేవి మంగళవారం తెలిపారు. కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు బాలుర విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి అడ్మిషన్ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. అలాగే 23వతేదీన దిన్నెదేవరపాడులో ఉన్న గురుకుల పాఠశాలలో ఆర్డర్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మెరిట్ విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అర్హతన పొందిన వారందరికీ ఇప్పటికే ఇంటిమేట్ చేస్తున్నట్లు తెలిపారు. సంబంధింత కేంద్రాలకు ఉదయం 8.300గంటలకు హాజరుకావాలన్నారు.

## భూగర్భ జలాలను పెంపొందించడానికి కృషి చేయాలి

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలను పెంపొందించడానికి కృషి చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీవో రామక్రిష్ణ, జలజీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం సభ్యులు బి.లక్ష్మినారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాతన గ్రామంలో గ్రామీన ఉపాధి హామీ పథకం లబ్ధిదారులకు నీటి ఎద్దడి, నీటి కొరతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపునీటిని పరిరక్షించాలన్నారు. చెట్లను పెంచాలని, ప్రతి కుటుంబం నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నీటి వృధా, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, ఉపాధి హామీ లబ్ధిదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## నేటి నుంచి శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధివ్రతం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మండలం మిట్నాల గ్రామంలో వినూత్నంగా దత్త అవతారం శ్రీపాద శ్రీవల్లభ దత్త హోమం నిర్వహిస్తున్నట్లు శ్రీఅవధూత శివరామస్వామి భక్త మండలి వారు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ నరసరావుపేటకు చెందిన కట్టా పద్మజ ఫౌండేషన్, శ్రీసమరసతా సేవా ఫౌండేషన్, నరసరావుపేట ఎ.ఎస్.ఎన్ కళాశాల అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీ బుధవారం ఉదయం గోపూజ, శ్రీలక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, సాయంత్రం 6గంటలకు గ్రామదేవతలందరికీ నూతన పట్టువస్త్రములు సమర్పణ, రాత్రి 8గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. 23వ తేదీ వైశాఖ పౌర్ణమి గురువారం సందర్భంగా శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధి వ్రతం, దత్త హోమం జరుగుతుందని తెలిపారు. పూర్ణాహుతి అనంతరం మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ సాయంత్రం శ్రీదత్తాత్రేయ స్వామివారి గ్రామోత్సవం, చాగలమర్రి భీమలింగేశ్వరస్వామి దేవస్థానం భక్తమండలి వారిచే నందికోల సేవ జరుగుతుందని చెప్పారు. గురువారం జరిగే హోమంలో 150జంటలు పూజలు పాల్గొంటారని తెలిపారు. రెండు రోజులు జరిగే కార్యక్రమానికి తెలంగాణా, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని అన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**దేవనకొండ మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం దేవనకొండ,ఆస్పరి పోలీసు సిబ్బందితో కలిసి మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో బాగంగా గ్రామంలోని ముచ్చు రామచంద్రుడు ఇంట్లో ఉన్నటువంటి 93 టెట్రా కర్నాటక అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండుకు పంపారు. ఈ సందర్బంగా ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని కావున 6వ తేదీ వరకు 144 సెక్షన్ ఉంటుందన్నారు. కాబట్టి ఎంతటి వారైనా సరే చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలోని ప్రజలు ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చెన్నయ్య,ఈశ్వర్,పక్కీరప్ప,కుమార్,భాస్కర్,నాయక్,శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

## సప్లిమెంటరీ పరీక్షకు హాజరవ్వొచ్చు..



మండల విద్యాశాఖ అధికారి మేరి హేమలత

**గడివేముల, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షకు హాజరు అవ్వవచ్చని మండల విద్యాశాఖ అధికారి మేరి సునీత అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 24వ తేది నుంచి జరుగబోయే పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షకు, మార్చి 2024లో పరీక్ష ఫీజు చెల్లించి, ఫైయిల్ అయిన మరియు పరీక్షకు హాజరు కాని విద్యార్థులందరూ పరీక్ష ఫీజు చెల్లించకపోయినను, ఈ సప్లిమెంటరీ పరీక్షకు హాజరవుటకు అర్హులని, సంబంధిత విద్యార్థుల హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కాబట్టి అలాంటి విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షకు హాజరై ఉత్తీర్ణులవ్వాలని తెలిపారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల యొక్క సిలబస్ మారుతుంది. కావున ఈ అవకాశన్ని అందరూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో తెలిపారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

**బండి ఆత్మకూరు , మేజర్‌న్యూస్:** గ్రామాల్లో ఉన్నటువంటి పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ విజయరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బండి ఆత్మకూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ భవనం నందు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ విజయరావు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల పంచాయితి సెక్రటరీలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, సురక్షితమైన మంచినీటి సరఫరా మరియు విద్యుత్తు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడినపుడు అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కాబట్టి గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోకుండా ఆయా గ్రామాల పంచాయితి సెక్రటరీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలందరికీ తెలియజేయాలని ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీలు రాగాల రమణ, ముంతల మధురాణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయరావు

## దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి ఏడవ వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులు

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** దివంగత నేత వైయస్సార్సీపీ నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి ఏడవ వర్ధంతి వేడుకల సందర్భంగా చెరుకులపాడు గ్రామంలోని ఆయన సమాధి వద్ద పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, మరియు రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ కుమార్ రెడ్డి క్రిష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డి, వైకాపా యువ నాయకుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డి మరియు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుండి వైసిపి పార్టీ నేతలు, కార్యకర్తలు, నారాయణరెడ్డి అభిమానులు భారీగా తరలివచ్చి నారాయణరెడ్డి సమాధి వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు. 2009 నుండి 14 వరకు కాంగ్రెస్ పార్టీ పత్తికొండ ఇన్చార్జిగా ఉంటూ పలు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశారని నారాయణ రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయినప్పటికీ పత్తికొండ నియోజకవర్గంలో నారాయణరెడ్డి అందించిన సేవలను గుర్తు చేసుకొని ఆయన వెంట నడిచిన సందర్భాన్ని చర్చించుకున్నారు. 2015 లో నారాయణరెడ్డి వైసీపీలోకి చేరడం ఆయనకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక హతమార్చిన సంఘటనను గుర్తు చేసుకుని సంతాపం వ్యక్తం చేశారు.

## ఫ్యాన్ జెండా ఎగిరేస్తాం

### వై. బాలనాగిరెడ్డి 20వేల ఓట్లుతో విజయం తథ్యం

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి పై వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై. బాలనాగిరెడ్డి 20 వేలకు పైగా ఓట్లు మెజార్టీతో విజయం సాధించి మంత్రాలయం పై ఫ్యాన్ జెండా ఎగిరేస్థాం అని పెద్దకడుబూరు జడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బారసబ్బు అనిల్ తనధీమ వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దకడుబూరు లో ఆయన మేజర్ న్యూస్ విలేకరితో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షతులై వై. బాలనాగిరెడ్డికి ఓటర్లు అధికంగా తమ యొక్క ఓట్లను వేయడం జరిగిందన్నారు. అధేవిధంగా ఆయన ప్రజల మనిషి గ్రామాలలో అభివృద్ధి పనులు జరగాలంటే అయనతోనే సాధ్యం అని చెప్పారు. అలాగే రాష్ట్రానికి మళ్ళీ ముఖ్యమంత్రి గా వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తాడని ఆయన చెప్పారు.



# ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ఏర్పాట్లకు చర్యలు

**– జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన**



చర్చిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థాని క రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్ ల లైవ్‌ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ముందు గా ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్సెస్ విభాగంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీఇంచి సంబంధిత రిజిస్టర్లలో సంతకాలు చేశారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు గదులు, స్ట్రాంగ్‌రూమ్‌కు దగ్గర ఉండకుండా ఎవరూ స్ట్రాంగ్ రూమ్ వైపు వెళ్లకుండా తాత్కలిక డోర్స్ ఏర్పాట చేయాలని ఆదేశించారు. అదే విధంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ రోజున వచ్చే పార్టీల ఏజెంట్లను గుర్తింపు వెరిఫై చేసుకొని కౌంటింగ్ సెంటర్లకు పంపే విధంగా ఏర్పాటు చేసుకోవాల న్నారు. అంతేకాకుండా రాకీయ పార్టీల ఏజెంట్లు, సిబ్బందికి వేర్వేరుగా గ్యాంగ్ వే తరహాలో ఎంట్రన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ కౌంటర్లు కూడా కౌంటింగ్ ఏజెంట్లకు, అధికారులకు వేర్వేరుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాని ద్వారా సదరు సిబ్బంది భోజనం పూర్తి చేసుకొని వారికి కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి చేరుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవతేజ, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ సస్పెండ్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:**
సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వతేదీన కర్నూలులో జరిగిన ఎన్నికల్లో విధులు వేసిన చోట విధులు నిర్వహించకుండా వేరే బూత్‌లో విధులు చేసిన కానిస్టేబుల్ కామేష్ నాయక్‌ను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ సస్పెండ్ చేశారు. 13న జరిగిన ఎన్నికల్లో 4వ పట్టణ పోలీసుస్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కామేష్ నాయక్‌కు కృష్ణానగర్‌లో ఉన్న కేశవరెడ్డి పాఠశాల పోలింగ్‌కేంద్రంలో ఎన్నికల విధులకు డ్యూటీ వేశారు. అయితే కామేష్‌నాయక్ సిల్వర్ జూబ్లీ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేయించారన్న వైసీపీ నాయ కులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎస్పీ విచారణ చేసి కానిస్టే బుల్‌ను సస్పెండ్ చేశారు.

# వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ సస్పెండ్

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :**
నంద్యాల మున్సిపాలిటిలోని వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ అబ్దుల్ రహమాన్‌ను సస్పెండ్ చేస్తూ కమీషనర్ నిరంజన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 39వ వార్డు సచివాలయంలో అబ్దుల్ రహ మాన్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. సచివాల యంలో రశీదులను జమ చేయడంలో జాప్యం చేసినట్లు ఆరోపణలు రావడంతో కమిషనర్ విచారణకు ఆదేశించారు. సీనియర్ అకౌంటెంట్ రమ్య, అకౌంట్స్ ఆఫీసర్ సురేఖ విచారణ జరిపి మంగళవారం నివేదికను కమిషనర్‌కు సమర్పించారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 16 వరకు అబ్దుల్ రహమాన్ సేకరించిన రూ.2,21,363 మొత్తంలో కొంత ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదు. రూ. 1,56,651లను జమ చేశారు. మిగిలిన రూ.64,712లు జమ చేయా ల్సి ఉంది. ఆయన స్థానంలో 43వ వార్డులోని వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజ రాజేశ్వరికి 39వ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

# తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టండి

**– రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ఓట్ల లెక్కింపు ముందు శాంతిభద్రతలు కాపాడటానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో అనుమతి పొందిన పనులు అమలుకు సంబంధించి పూడికతీత పనులు, వ్యవసాయ సంబంధిత పనులు, నీటి సరఫరా సంబంధితర మరమ్మతుల పనులు, పంట పొలాల అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే ట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో మధుసూదన్‌రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, గనుల శాఖ డీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ నృసింహస్వామి షడ్వింశతి 26వ వార్షికోత్సవాలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దు లేటి లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో షడ్వింశతి 26వ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు మధుసూధన్‌రాయల్ తెలిపారు. మంగళవా రం వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు 21వ తేదీ స్వామి జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని ఆలయంలో అర్చకు లు శ్రీదేవి భూదేవి సమేత శ్రీఘణ మద్దులేటి లక్ష్మి నృసింహస్వామి వారికి కలశాభిషేకం, స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహిం చారు. భక్తులు విశేషంగా పాల్గొని సామూహిక అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారికి నివేదన, మహామంగళహారతి ఇచ్చారు.



శ్రీ స్వామి అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణ లో శ్రీమద్దులేటి లక్ష్మి నృసింహ స్వామి వార్లు



ఆలయం ఆవరణంలో స్వామి అమ్మవార్ల పల్లకి వద్ద కలశపూజ చేస్తున్న దృశ్యం

# బిఎల్వోల శ్రమ దోపిడి

- **జగన్ సర్కార్ దెబ్బ– బిఎల్వోలపై ఆర్థిక భారం**
- **మూడేళ్ల గౌరవ వేతనం కోసం ఎదురుచూపు**
- **సంవత్సరానికి రూ. 6వేలు– అందినది రూ. 4,500**
- **ఒక్కొక్క బిఎల్వో ఖర్చుల రూ. 30 వేల పై మాటే**
- **నంద్యాల జిల్లాలో బకాయిలు రూ. 6 కోట్ల పై మాటే**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లాలో పోలింగ్ స్టేషన్ పర్యవేక్షణ అధికారుల శ్రమ దోపిడికి గురవుతుంది. శ్రమ ఎక్కువ, పారితోషకం తక్కువ ఒక వైపు గౌరవ వేతనం అందక బిఎల్‌ఓలు ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. వైసీపీ సర్కార్ దెబ్బకు బిఎల్‌ఓలు కుదేలవుతున్నారు. మూడేళ్ళలో అందాల్సిన పారి తోషకం రూ. 36 వేలు అయితే రూ. 4500 మాత్రమే అందింది. మూడేళ్ళుగా గౌరవ వేతనం కోసం బిఎల్‌ఓలు ఎదురు చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో మొదలైన ఓటరు నమోదు ప్రక్రియ మొదలుకొని సార్వత్రిక ఎన్నికల వరకు ఒక్కొక్క బిఎల్‌ఓ రూ. 30 వేలకు పైగానే ఖర్చు పెట్టారు. నంద్యాల పార్లమెంట్‌లో 1983 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. బిఎల్‌ఓలకు అందించాల్సిన బకాయిలు నంద్యాల జిల్లాలో రూ. 6 కోట్లకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిస్తే తమ పరిస్థితి ఏమిటని బిఎల్‌ఓలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..

మున్సిపల్ ఎన్నికల సమయంలో బిఎల్‌ఓలకు ఓటరు నమోదు మొదలుకొని రెండు ఓట్లు తొలగింపు, నియోజకవర్గాల మార్పు, ఓటరు సవరింపు తదితర వాటి కోసం ఫారం 6, ఫారం 7, ఫారం 8, ఫారం 6బి ప్రక్రియను చేపట్టారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ. 500లు గౌరవ వేతనాన్ని ప్రకటించింది. అందులోనే ఓటర్లను చైతన్యం చేయడం, ఓటు హక్కును వినియోగించుకోవ డం, ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదుతోపాటు 85 సంవత్సరాలు దాటిన వారిని, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారిని ఓటు వినియోగింప చేయడంతోపాటు ఎన్నికల సమయంలో ఆయా బూత్ ల పరిధిలో ఓటరు స్లిప్‌లను ఇంటింటికి పంపిణీ చేయడం బిఎల్‌ఓలు విధులు నిర్వహిస్తారు. జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం రోజున ప్రతి ఏడాది చివరిలో డిసెంబర్‌లో ఓటరు నమోదు కార్యక్రమాలను బిఎల్‌ఓలు నిర్వహిస్తారు. బిఎల్‌ఓల శ్రమ ఎక్కువగా కనిపిస్తున్నా పారితోషకం మాత్రం తక్కువగా అందిస్తున్నారు. అందించాల్సిన పారితోషకం 2022 నుంచి మూడేళ్ళకు గాను ఒక్కొక్క బిఎల్‌ఓకు రూ. 36 వేలు ప్రభుత్వం అందించాల్సి ఉండగా, ఏడాది క్రితం ఒక్కొక్క బిఎల్‌ఓలకు రూ. 4500 చెల్లించారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలో 1983 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఆళ్ళగడ్డలో 295, శ్రీశైలంలో 226, నందికొట్కూరులో 251, నంద్యాలలో 286, బనగానపల్లెలో 272, డోన్‌లో 291, పాణ్యంలో 357 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ. 7.13 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఏడాది క్రితం రూ. 89 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. ఇంకా రూ. 6.24 కోట్లు బిఎల్‌ఓలకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. బిఎల్‌ఓలకు ఎటువంటి స్టేషనరీని అందించలేదు. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు రూ. 12000లు ఏడాదికి ప్రభుత్వం ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు ముందు రోజు రూ. 250 , పోలింగ్ రోజు రూ. 250లు ఇంకా చెల్లించలేదు. పిఓ, ఎపిఓ, ఓపిఓలకు రెండు రోజుల విధుల నిర్వహణకు పారితోషకం జిల్లా ఎన్నికల అధికారులు చెల్లించారు.



ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)



ఈవీఎంలపై ఓటరుకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

బిఎల్‌ఓలకు చెల్లింపులు జరుగలేదు. పోలింగ్ రోజున పోలింగ్ బూత్ ఎన్నికల అధికారులకు విధి నిర్వహణలో భాగంగా పని చేసిన బిఎల్‌ఓలకు ఎన్నికల పారితోషకం జిల్లా ఎన్నికల అధికారులు అందించడంలో జాప్యం కొనసాగుతుంది. ఎన్నికల నియమావళి వచ్చిన తర్వాత బిఎల్‌ఓలకు స్టేషనరీ ఇవ్వక పోవడంతో ఒక్కొక్క పోలింగ్ బూత్ అధికారికి రూ. 5000 ల దాకా ఖర్చు వచ్చినట్లు బిఎల్‌ఓలు వాపోతున్నారు. ఇప్పటికే బిఎల్‌ఓల గౌరవ వేతనంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి వీఆర్వో రాష్ట్ర సంఘం తీసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ఎంతో కీలకంగా విధులను నిర్వహిస్తారు. ఓటరు జాబితా తుది ప్రకటన విడుదలయ్యే వరకు బిఎల్‌ఓలు ఎంతో శ్రమిస్తారు. జిల్లా ఎన్నికల అధికారులు బిఎల్‌ఓలు మోస్తున్న ఆర్థిక భారం నుంచి తప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.